


జిల్లాలో ముసురు వర్షం

- నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం
- ఊపందుకున్న వరినాట్లు
- వ్యవసాయ కూలీలకు డిమాండ్
- చెరువులు, కుంటల్లో చేరుతున్న నీరు
- ఎస్సారెస్పీకి క్రమేపీ పెరుగుతున్న వరద

నిజామాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో గడిచిన ఐదు రోజులుగా ఈ వర్షాలు పడుతున్నాయి. గత రాత్రినుంచి ఎడతెరపి లేకుండా ముసురు వాన నుంచి ఓ మోస్తారు వర్షాలు పడుతుండగా జిల్లాలోని పలు గ్రామాల పరిధిలో వాగుల్లోకి వరద చేరుతోంది. ఈ వర్షాల ప్రభావంతో చెరువుల్లో వరద చేరుతోంది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో రైతులు కూడా వరినాట్ల జోరుపెంచారు. జిల్లాతోపాటు ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కూడా వరద వస్తోంది. ప్రాజెక్టులోకి క్రమేపి వరద పెరుగుతుండటంతో నీటిమట్టం కూడా పెరుగుతోంది. ఈవర్షాల ప్రభావం మరో మూడురోజుల వరకు ఉంటుందని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు.

• ఐదు రోజులుగా జల్లులు

నైరుతి రుతుపవనాల ప్రభావం, బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గడిచిన ఐదురోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిమండలాల పరిధిలో జల్లులతో కూడిన వర్షం పడుతుండగా మరికొన్ని మండలాల పరిధిలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం పడుతోంది. జిల్లాలోని అన్నిమండలాల పరిధిలో శుక్రవారం రాత్రి ముసురు వర్షం కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో వర్షం పడుతుండటం వల్ల వాగులు, చెరువుల్లోకి క్రమేపి వరద నీరు చేరుతోంది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు 315.5 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 347.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. సరాసరి వర్షానికంటే ఎక్కువగానే ఈ వర్షం పడిన



నాలుగు మండలాల్లో మాత్రం ఇంకా సగటు వర్షపాతం నమోదుకాలేదు. జిల్లాలోని 11 మండలాల్లో సగటు వర్షపాతం కంటే ఎక్కువ వర్షం పడగా 18 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 996 చెరువులు ఉండగా ప్రస్తుతం ఈ వరదనీరు వచ్చి చేరుతోంది. వర్షం ఎడతెరపి లేకుండా పడుతుండటంతో భారీ వర్షం పడినచోట ఎక్కువగా చెరువులకు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో పడుతున్న వర్షాలతో 37 చెరువులు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నిండాయి. 57 చెరువులు 75 శాతానికి పైగా నిండగా, 157 చెరువులు 50 శాతానికి పైగా నిండాయి. 155 చెరువులకు 50 శాతం లోపు నీళ్లు వచ్చిచేరాయి. మిగతా చెరువుల్లో 25 శాతానికి లోపు వరదనీరు వచ్చి చేరింది.

• జోరుగా వరినాట్లు

జిల్లాలో రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో ఎక్కువమంది రైతులు భారీగా పెట్టుబడులు పెడుతూ వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. జిల్లావ్యాప్తంగా ఒకేసారి రైతులు ఎక్కువ మొత్తంలో వరిసాగు చేస్తుండటంతో ఎక్కువ మొత్తంలో నాట్లకు కేటాయిస్తున్నారు. జూన్ ఆరంభంలోనే నార్లు పోసి ఉండటం సమయం దాటుతుండటంతో ఎక్కువమంది రైతులు ఈ వర్షాలు పడుతుండటంతో వర్షంలోనే వరినాట్లను వేస్తున్నారు. రైతులందరూ ఒకేసారి నాట్లు వేయడంతో కూలీలకు ఎకరాకు రూ. 4,500 చెల్లిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా యూపీ, బీహార్, ఒరిస్సా, నల్గొండ జిల్లాల నుంచి వచ్చిన కూలీలు ఈ వరినాట్లను వేస్తున్నారు. జిల్లాలోని అన్నిప్రాంతాల్లో వరినాట్లను వేస్తుండటంతో ట్రాక్టర్లకు కూడా డిమాండ్ పెరిగింది. జిల్లాలో ఇప్పటివరకు 2లక్షల 80వేల ఎకరాలకు పైగా వరినాట్లను వేశారు. ఈనెలాఖరులోపు జిల్లాలో 4లక్షల ఎకరాలకు పైగా వరిసాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరిసాగు చేస్తున్న రైతులు ఎక్కువ మొత్తంలో సన్నరకాలనే వేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మొత్తంలో ఈ సాగును కొనసాగిస్తున్నారు.

• శ్రీరాంసాగర్‌కు పెరుగుతున్న వరద

జిల్లాతోపాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో వరద పెరుగుతోంది. ఎగువ ప్రాంతంతోపాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న ఈ వర్షాలతో ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతోంది. గోదావరితోపాటు మంజీరా, హరిదనదులతోపాటు వాగుల ద్వారా కూడా వరద రావడంతో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 18,275 క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. బాబ్లీగేట్లు ఎత్తి ఉండటంతో ఎగువ ప్రాంతంలో పడుతున్న వర్షాలతో ఈ వరద వస్తోంది. కందకుర్తి వద్ద వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు 1066.60 అడుగుల నీళ్లున్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు 18.131 టీఎంసీల నీళ్లున్నాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్టులోకి వరద పెరిగే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.





సొసైటీ రుణాలకూ మాఫీ వర్తింపు!

- రూ.లక్ష లోపు రుణాలున్న రైతుల కోసం రూ.75 కోట్లు విడుదల చేసిన సర్కారు
- ఉమ్మడి జిల్లాలోని సొసైటీల పరిధిలోని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న అధికారులు

నిజామాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీని సహకార బ్యాంకుల పరిధిలో రైతులకు కూడా వర్తింపజేసింది. జాతీయ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల లాగానే వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. రుణమాఫీ అయినట్లు వారికి సమాచారం ఇస్తున్నారు. మొదట ప్రధాన బ్యాంకులకు సంబంధించిన రైతుల జాబితాను ప్రకటించిన అధికారులు సహకార బ్యాంకులకు సంబంధించి రుణమాఫీ నిధులను కేంద్ర సహకార బ్యాంకులో జమచేశారు. ఆ బ్యాంకుల నుంచి ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు మళ్లిస్తూ రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. రుణమాఫీని సంఘాల వారిగా ప్రకటిస్తున్నారు.

• రూ.లక్ష లోపు ఉన్నవారందరికీ..

రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ. లక్ష లోపు రుణాలు ఉన్న రైతులకు మాఫీని చేపట్టింది. మూడు రోజుల క్రితం వారి ఖాతాల్లో డబ్బులను జమ మొదలుపెట్టింది. జిల్లాలో జాతీయ, ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులకు చెందిన 44,455 మంది రైతుల రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించారు. వారి జాబితాను ఆయా బ్యాంకుల వారిగా ప్రకటించడంతో పాటు వారి ఖాతాల్లో రూ.225.62 కోట్లను జమచేస్తున్నారు. జిల్లాలో ఈ బ్యాంకులతోపాటు సహకార బ్యాంక్‌ల పరిధిలో రుణాలు తీసుకున్న రైతులు కూడా ఉన్నారు. వీరంతా ఆయా సహకార సంఘాల పరిధిలోని బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాపరిధిలో ఈ రైతులు 23,500 వరకు ఉన్నారు. వీరికి సంబంధించిన లక్షలోపు రుణాల కోసం రూ.75 కోట్లను ప్రభుత్వం ఎన్‌డీసీసీ బ్యాంక్ ఖాతాలో జమచేసింది. ఆ బ్యాంక్ ఖాతా నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోని సహకార సంఘాలకు ఈ నిధులను మళ్లించారు. వాటిపరిధిలోని రైతుల ఖాతాలకు గడిచిన రెండు రోజులుగా జమచేస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు 89 ఉండగా కామారెడ్డి పరిధిలో 53 ఉన్నాయి. వీటి పరిధిలోని పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో డబ్బుల జమ మొదలుపెట్టారు.

• సోమవారంలోపు రైతుల ఖాతాల్లోకి..

సోమవారంలోపు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న సహకార సంఘాల పరిధిలోని రైతుల ఖాతాల్లో మళ్లింపును పూర్తి చేయనున్నారు. రైతులకు సమాచారాన్ని అందించనున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించి ఖాతాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ కాకపోవడం కేంద్ర బ్యాంక్‌కు అనుసంధానం కాకపోవడంతో ఆ రైతులకు జమ ఆలస్యమైంది. సహకార సంఘాల పరిధిలో కూడా రైతుల వారిగా జాబితాను ప్రకటించడంతో పాటు వారికి మాఫీ అయినట్లు అధికారులు వివరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నిధులను రైతుల ఖాతాల్లోకి మళ్లిస్తూ జమ చేస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. లక్షలోపు రుణాలున్న రైతుల అందరి ఖాతాల్లోనూ వీటిని జమ చేస్తున్నట్లు తెలిపారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

- లోతట్టు ప్రాంతాల పరిశీలన

సుభాష్‌నగర్, జూలై20: గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులను పలు సూచనలు చేశారు. నగరంలోని రీహబిలిటేషన్ సెంటర్ అయిన బాబాసహెబ్‌పాడ్‌ను పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలైన అర్సపల్లి, నిజాంకాలనీ, ఖానాపూర్, మాలాపల్లి, తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నగరంలోని పలు ప్రాంతాలను వివిధశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రెండురోజులపాటు భారీ వర్షాలు ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలని కోరారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- నిర్లక్ష్యం, బాధ్యతారహిత్యం వల్లే రోడ్డు ప్రమాదాలు
- ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ తప్పనిసరి: జిల్లా న్యాయాధికారి, పోలీసు కమిషనర్



మైనర్‌డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ అంశాలపై మాట్లాడుతున్న న్యాయధికారి, సీపీ

ఖిల్లా, జూలై20: నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆందోళన వ్యక్తంచేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పిల్లల తల్లిద్రండులను కోరారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీస్‌శాఖ సౌజన్యంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మైనర్‌డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్ అంశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి సునీత కుంచాల ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతి వేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని అన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతోపాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరనినష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీన్ని నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కఠిన చట్టాలను అమల్లోకి తెచ్చిందని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కూడా నేరస్తులుగా పరిగణించబడుతారని అన్నారు. మైనర్‌లు వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులకు కూడా చట్టప్రకారం మూడేళ్ల కారాగార శిక్ష, 25వేల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. లైసెన్సు కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని జిల్లా న్యాయాధికారి హితవు పలికారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందని గమనించి బయటకు వెళ్లే సమయంలో తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని లేకుంటే కుటుంబం చిన్నాభిన్నం అయ్యేపరిస్థితి నెలకొంటుందన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాలతో ప్రతీ గంటకు 19మంది మృత్యువాత పడుతున్నారని, ఇదిఎంతో ఆందోళన కలిగించే అంశమని ప్రతీఒక్కరు దీన్ని గురించి ఆలోచించాలని అన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, ఓవర్‌టేక్ చేయడం, సెల్‌ఫోన్‌డ్రైవింగ్, సామర్థ్యానికి మించి ఎక్కించుకోవడం, సిగ్నల్స్‌జంప్ చేయడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలో గడిచిన ఏడాది కాలంలోనే రోడ్డుప్రమాదంలో 550మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాలపెచ్చుమీరేందుకు కారణం అవుతుందని అన్నారు. ముఖ్యంగా యువత అతివేగాన్ని మానుకోవాలని, రోడ్డుభద్రత నిబంధనలు తప్పకుండా పాటిస్తూ అప్రమత్తతతో వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. బైకు నడిపేవారికి వచ్చే ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తామని హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో టీజీఎస్పీ ఏడవ బెటాలియన్ కమాండెంట్ రోహిని ప్రియదర్శిని, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న ఉద్యోగుల బదిలీలు

- అటెండర్ నుంచి అధికారి వరకు కౌన్సెలింగ్
- ఖాళీలను బట్టి ఆయా ప్రాంతాలకు
- ఇప్పటికే కొన్నిశాఖలకు ఉత్తర్వులు జారీ

నిజామాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాబితాను సిద్ధం చేశారు. ఆయా శాఖల పరిధిలో కౌన్సిలింగ్‌ను ఉద్యోగులు ఇచ్చిన వెబ్‌ఆప్షన్ ప్రకారం నిర్వహించారు. ఖాళీలను బట్టి ఆయా ప్రాంతాలకు బదిలీని మొదలుపెట్టారు. జిల్లా క్యాడర్ నుంచి రాష్ట్ర క్యాడర్ వరకు అధికారుల బదిలీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కొన్ని శాఖల పరిధిలో బదిలీ ఉత్తర్వులు వెలువర్చగా మరికొన్ని శాఖల్లో వెలువడనున్నాయి. జిల్లాలో సరాసరి అన్నిశాఖల్లో ఉద్యోగుల నుంచి అధికారుల వరకు సుమారు 500కు పైగా బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ, సహకార శాఖల్లో కొద్దిరోజులపాటు బదిలీలను నిలిపివేయగా మిగతా అన్నిశాఖల్లో ఈ బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్నిశాఖలు వెలువడగా మరికొన్ని శాఖలో బదిలీ ఉత్తర్వులు వెలువడనున్నాయి. బదిలీ అయినవారు కొన్నిశాఖల ఉద్యోగులు చేరుతుండగా మరికొంత మంది సోమ, మంగళవారం చేరేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

• బదిలీల్లో నాలుగేళ్ల సర్వీసు ఉద్యోగులు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో నాలుగేళ్లపాటు ఒకేచోట పనిచేసిన ఉద్యోగులు బదిలీ అవుతున్నారు. జిల్లా క్యాడర్‌తోపాటు జోన్, రాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఉద్యోగులలో కొన్నిశాఖల వారికి ఇప్పటికే బదిలీఉత్తర్వులు వెలువడగా మరికొన్ని శాఖలకు ఉత్తర్వులు వెలువడనున్నాయి. అన్ని శాఖల పరిధిలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను 40శాతం మించకుండా ఈ బదిలీలను చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్నిశాఖల పరిధిలో సీనియారిటీ లిస్ట్‌లను తయారు చేశారు. ఆయా శాఖల పరిధిలో జాబితాను ప్రకటించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని వెబ్‌ఆప్షన్ ద్వారా కోరుకున్న ఐదు స్థానాల్లో వెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. ఆ ఆప్షన్ల ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలను చేపట్టారు.

• అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు

జిల్లాస్థాయిలో అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్, ఇతరశాఖల్లో ఈ కౌన్సిలింగ్‌ను చేపట్టి ఇప్పటికే కొన్నిశాఖల పరిధిలో ఉత్తర్వులను జారీచేశారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టుల బదిలీజోన్ పరిధిలో ఉన్న రాష్ట్రస్థాయిలో విన్నవించిన మీదట జిల్లాస్థాయిలోనేవారి బదిలీకి అవకాశమిచ్చారు. ఖాళీల్లో శాఖల వారిగా సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని భర్తీచేశారు. జిల్లా పంచాయతీశాఖలో బదిలీల ద్వారా 130మంది జూనియర్ కార్యదర్శులు బదిలీ అయ్యారు. వీరికి ఉత్తర్వులను కూడా జారీచేశారు. వీరితోపాటు కార్యదర్శుల గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు కూడా బదిలీలను చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 18మంది ఎంపీవోలను కూడా బదిలీ చేశారు. రెవెన్యూ పరిధిలో 8మంది డిప్యూటీ తహసీల్దార్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు కూడా బదిలీ అయ్యారు. మున్సిపల్ పరిధిలో కొన్నిపోస్టులను లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో బదిలీ చేపట్టగా కొన్నిపోస్టులో రీజినల్ డైరెక్టర్ స్థాయిలో, మరికొన్ని పోస్టులు డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, టౌన్‌ప్లానింగ్ రాష్ట్ర డైరెక్టర్ పరిధిలో చేపట్టారు. వీరిలో కొందరికి ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేయగా మరికొంత మందికి ఉత్తర్వులను వెలువర్చనున్నారు.

• వ్యవసాయ, సహకార, సాగునీటి శాఖల్లో ఆగిన బదిలీలు

ప్రస్తుతం రుణమాఫీ అమలవుతుండటంతో వ్యవసాయ, సహకార శాఖల్లో కొద్దిరోజులపాటు బదిలీలను నిలిపివేశారు. సాగునీటి శాఖలోను కూడా బదిలీలను వర్షాల దృష్ట్యా ఆపివేశారు. ఇవేకాకుండా ఇతర శాఖల్లోనూ ఈ బదిలీలు కొనసాగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్ సిబ్బంది నుంచి పారామెడికల్ సిబ్బంది వరకు బదిలీలు జరుగుతున్నాయి. వైద్యుల బదిలీలతోపాటు జిల్లాస్థాయి కీలకమైన పోస్టుల బదిలీ కొనసాగుతోంది. ఇవేకాకుండా మెడికల్ కళాశాలలోని బదిలీలు కొనసాగుతున్నాయి. ఆయా ఇంజనీరింగ్ శాఖల్లో కూడా బదిలీలు వెలువడుతున్నాయి. పోలీస్ శాఖలోనూ బదిలీలకు రంగం సిద్ధంచేశారు. ఎస్సై నుంచి సబ్ డివిజనల్ అధికారుల వరకు బదిలీ కానున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల ముందే బదిలీ జరగడంతో కొద్దిమందికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం జిల్లాలో పనిచేస్తున్న సుమారు 500మంది వరకు ఉద్యోగులు, అధికారులు బదిలీ అయినట్లు తెలుస్తోంది.



బోధన్‌లో ఘనంగా ఊర పండుగ

● నడ్డి ఊరు హనుమాన్ మందిరం నుంచి గ్రామ దేవతల ఊరేగింపు
● అలరించిన పోతురాజుల విన్యాసాలు



ఫలహార బండిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



గ్రామచావిడి వద్ద పోతురాజుల విన్యాసాలు

బోధన్‌రూరల్, జూలై 20: బోధన్ పట్టణంలో శనివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గత శుక్రవారం ఊర పండుగ కోసం ముడుపు వేసిన అనంతరం గ్రామస్థులు పట్టణ ఆచారాలు, సంప్రదాయాలను పాటించారు. శనివారం తెల్లవారుజాము నుండే ఊర పండుగ కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని నడి ఊరు హనుమాన్ మందిరం నుండి అన్ని గ్రామ దేవతలకు ఊరేగింపుగా వెళ్లి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈసందర్భంగా పోతురాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి పట్టణంలోని అన్ని కుల సంఘాల నాయకులు, సభ్యులు గ్రామాభివృద్ధి కమిటీ ఆదేశాలు పాటిస్తూ ఊర పండుగకు సహకరించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంట చల్లగా ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడి ఊరు హనుమాన్ మందిరం నుండి ఫలహార బండిని అన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ మహలక్ష్మీ ఆలయానికి చేరుకున్నారు. మహలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊర పండుగ అనంతరం బండిని ప్రత్యేక పూజల అనంతరం గ్రామశివారులో వదలిపెట్టారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఊర పండుగ కార్యక్రమాన్ని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ నెల 12న గ్రామ నడిబొడ్డు చావిడి వద్ద ముడుపు వేయడం జరిగిందని, శనివారం ఊర పండుగను గ్రామ ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించడం జరిగిందన్నారు. ఊర పండుగకు సహకరించాలని అన్ని కులాల నాయకులు, ప్రజలకు, యువకులకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీనాయకులు సూర్యప్రకాష్, గుమ్ముల అశోక్, రుద్ర సత్యనారాయణ, కొంగ్ర వెంకటి, బీర్కూర్ బుజ్జి, మాసుల శ్రీను, గుంత గంగాధర్, ఐదు తర్ఫల కుల సంఘాల నాయకులు, సభ్యులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

● పోలీసుల భారీ బందోబస్తు

ఊర పండుగ సందర్భంగా బోధన్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ వీరయ్య భారీ బందోబస్తు నిర్వహించారు. బోధన్‌లో నిర్వహించే ఊర పండుగ శనివారం ప్రశాంతంగా జరిగింది.

జీజీహెచ్‌లో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

● ఆసుపత్రి కారిడార్‌లో నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లిన వైనం
● మెట్‌పల్లిలో బాలుడిని గుర్తించిన పోలీసులు

పెద్దబజార్, జూలై 20: ఆసుపత్రి ఆవరణలో నిద్రిస్తున్న మూడేళ్ల బాలుడిని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేపింది. మాక్లూర్ మండలం మానిక్‌భండార్‌కు చెందిన సాయినాథ్ గర్భిణీ అయిన తన భార్య సాయమ్మను డెలివరీ కోసం బుధ వారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. భార్య డెలివరీ వార్డులో ఉండగా.. శుక్రవారం రాత్రి తన మూడేళ్ల కుమారుడు అరుణ్‌ను వెంట తీసుకుని ఆసుప్రతి కారిడార్‌లో నిద్రించగా.. కొద్దిసేపటి తర్వాత చూడగా పక్కన తన కొడుకు లేకపోవడంతో ఆందోళనకు గురై ఆసుపత్రిలో ఉన్న పోలీసు సిబ్బందికి ఫిర్యాదుచేశాడు. ఆసుపత్రిలో, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో 1వ టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో పోలీసులు ఆసుపత్రికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి ఆ బాలుడిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి కేసు దర్యాప్తు చేపట్టారు.

● మెట్‌పల్లిలో బాలుడి గుర్తింపు.. పోలీసు అదుపులో ఇద్దరు నిందితులు

నిజామాబాద్ జీజీహెచ్‌లో కిడ్నాప్‌కు గురైన బాలుడు అరుణ్‌ను జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో పోలీసులు గుర్తించారు. వెంటనే బాలుడిని తమ ఆధీనంలో తీసుకుని ఆర్మూర్‌కు చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజనంలో రాజీ పడొద్దు

● డీఎల్‌పీవో శ్రీనివాస్

ధర్పల్లి, జూలై 20: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఏజెన్సీలు రాజీ పడవద్దని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. భోజన విషయంలో రాజీపడవద్దని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, నీటి సౌకర్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, పారిశుద్ధ్యంపై మండల పరిషత్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున కార్యదర్శులు స్థానికంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు గ్రామంలో పర్యటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఈవో సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'24న జీవిత బీమాపై స్పెషల్ డ్రైవ్'

పెద్దబజార్, జూలై20: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు గ్రామీణ తపాల జీవిత భీమాపై అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం ఈనెల 24న స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి తక్కువ ప్రీమియం అధిక బోనస్‌తో ఐదు రకాల జీవిత భీమా పాలసీలను అందిస్తోందని, 19 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యగల వ్యక్తులు ఈ బీమా తీసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. గరిష్టంగా 10లక్షల పాలసీని పొందవచ్చని, పాలసీదారు ప్రతీనెల, మూడునెలలు, ఆరునెలలు, సంవత్సరం వాయిదాలలో ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. యువకులు తీసుకుంటే ఎక్కువ లాభం పొందే అవకాశంఉందని పాలసీని ఆమోదించిన తేదీ నుంచి జీవితబీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణిస్తే సమ్ అస్యూర్డ్ మరియు బోనస్ నామినీకి అందించబడుతాయని తెలిపారు. పాలసీ మెచ్యూరిటీ సమయంలో పాలసీదారు జీవించి ఉంటే పాలసీదారునికి హామీ మొత్తం బోనస్ వస్తుందని, పాత ప్రీమియంతో పాలసీని కొనసాగించవచ్చని తెలిపారు.

కోటగిరిలో ముసురు వర్షం

కోటగిరి, జూలై20: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం ముసురుతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి రాత్రి వరకు అడపదడప చిరుజల్లులతో కూడిన వర్షానికి రహదారులన్ని చిత్తడిగా మారాయి. వాగులు, వంకల్లోకి స్వల్పంగా వర్షం నీరు వచ్చి చేరింది.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత

జక్రాన్‌పల్లి, జూలై20: మండలంలోని అర్గుల్‌గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉపాధ్యాయుడు తిరునగిరి ఆంజనేయవరప్రసాద్ స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు తన సొంతంగా వంద మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను కొనుగోలు చేసి అందజేశారు. మాజీసర్పంచ్ గోర్త పద్మరాజేందర్, మాజీఎంపీటీసీ హరిత చిన్నారెడ్డి, ఏపీసీచైర్మన్ లక్ష్మీ, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల సమయాల్లో మార్పులు: ఎంఈవో

మోర్తాడ్, జూలై20: ప్రభుత్వఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్పు చేసినట్లు ఎంఈవో ఆంధ్రయ్య శనివారం తెలిపారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈనెల 22 నుంచి పాఠశాలలు నడపాలని ఎంఈవో కోరారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని ఆయన కోరారు.

నూతన భారతీయ చట్టాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్ లీగల్, జూలై 20: తెలంగాణ రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య ఉమ్మడి జిల్లాల పీపీలతో నూతన చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల పీపీలు పాల్గొన్నారు.

● అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

రహీముద్దీన్ నిజామాబాద్ జిల్లా, జి.రామకృష్ణ ఆర్మూర్ మండలం నుంచి ప్రథమశ్రేణి కోర్టు పోలీసువారి తరపున క్రిమినల్ కేసులు వాధించడానికి వీరిని నియమించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ప్రాసిక్యూటర్‌లు సమ్మయ్య, బూసారపు రాజేష్, వసంత్, రాణి, శివరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జూలై20: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు టీటీడీసీ కోఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాటశాల ఆవరణలో శనివారం బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 19-40సంవత్సరాల వయసు కలిగిన వారికి తమ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 30రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు వచ్చే వారికి భోజన వసతి కల్పించి ఉదయం నుండి సాయంత్రం వరకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ సెంటర్ ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర దత్తసాయి ఆలయంలో ముగిసిన సప్తాహ కార్యక్రమం

మోస్రా, జూలై 20: మండల కేంద్రంలోని మోస్రా శ్రీ విఘ్నేశ్వర దత్తసాయి ఆలయంలో 14ఆదివారం రోజు నుండి ఏడు రోజుల పాటు సప్తాహ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా భగవత్ స్వరూప విగ్రహాలను ట్రాక్టర్‌లో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు నరేష్ మాట్లాడుతూ భక్తితో భజన చేసిన భజన మండలికి అభినందనలు తెలుపుతూ సన్మానించారు. అదే విధంగా ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా యజ్ఞం, సాయి సచ్చరిత్ర పారాయణం, గురు చరిత్ర పారాయణం, అఖండ సాయినామం, ఉదయం 5గంటలకు కాగడ హారతి, 6గంటలకు అభిషేకం, 8గంటలకు యజ్ఞం కార్యక్రమం, 10 గంటలకు సత్యనారాయణ వ్రతాలు, 12గంటలకు హారతి తర్వాత అన్నదానం కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని భక్తులను కోరారు.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

జక్రాన్‌పల్లి, జూలై 20: మండలంలోని బ్రహ్మణ్‌పల్లిలో గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపి శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని అంత్యక్రియాల కోసం ఎంపీడీవో సతీష్‌కుమార్ రూ.10వేల కుటుంబ సభ్యులకు అందజేశారు. అంత్యక్రియాల్లో ఎంపీడీవో సతీష్‌కుమార్, పంచాయతీ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం, మాజీ సర్పంచ్ లత దేవరాజ్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌లు ఉన్నారు.

బీడీకార్మికుల జీవనభృతి పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు, బీడీకార్మికులు

ఆర్మూర్‌టౌన్, జూలై20: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీకార్మికుల జీవనభృతిని పెంచాలని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న అన్నారు. శనివారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మహిళలు బీడీ చుట్టే కార్మికులు, ప్యాకింగ్ కార్మికులు, చాటన్‌కార్మికులు బట్టీవాల, వాచ్‌మెన్, ఆఫీస్ వర్కర్‌లు ఇతరులు బీడీ పారిశ్రామపై ఆధారపడి జీవిస్తున్నారని ఆయన అన్నారు. జీవనోపాధి కొనసాగడానికి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతిని రూ.4016పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు అర్వింద్, తుప్పటి శ్రీనివాస్; నజీర్, పద్మ, సునీత, లక్ష్మీ, మమత, బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జోరలో బీఆర్‌ఎస్ కార్యకర్తపై దాడి



గాయపడ్డ బీఆర్‌ఎస్ కార్యకర్త

భీమ్‌గల్ రూరల్, జూలై 20: భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామ శివారులోని కప్పలవాగు నుంచి శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మరికొంత మంది వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాటలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కర్నె మహేందర్ బెజ్జోర గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త భాస్కర్ కొట్టుకున్నట్లు సమాచారం. తో పులాటలో ఇరువురికి గాయాలయ్యాయి. కర్నె మహేందర్ తలకు గాయం కావడంతో రక్తస్రావం అయ్యింది.. భాస్కర్ కు కూడా కుడి చేతికి గాయాలు అయ్యాలనాన్నరు.ఇక్కడే ఉన్న మాజీ బీఆర్‌ఎస్ ఎంపీపీ ఆర్మూర్‌మహేష్ పోలీసులకు సమాచారం అందించాడు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో దాడి జరగడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. వాగులో నుంచి బయటకు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం బీఆర్‌ఎస్ కార్యకర్త కర్నె మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి బెజ్జోర గ్రామ శివారులోని కప్పల వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం . దాడి జరిగిన నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

మోస్రా జడ్పీహెచ్‌ఎస్‌లో పేరెంట్స్ మీటింగ్

మోస్రా,జూలై20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ చదువు కొరకు కేటాయించవలసిన సమయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంత శ్రద్ధగా ఉన్న ఇంటి వద్ద కూడా శ్రద్ధతో చదివేల సమయం ఇవ్వాలని పిల్లలకు చదువు ఒకటి కాకుండా మానసిక ఒత్తిడికి లోనవకుండా ఆరోగ్యం పట్ల, శరీరం దృఢంగా ఉండాలంటే ఆటల కొరకు కొంత సమయం ఇస్తూ ఉన్నాం అదే విధంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సంగీత, పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, స్వరూప, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే!

● అధ్వాన్నంగా ఖానాపూర్ రోడ్డు ● కోట్లు ఖర్చుచేసినా నిష్ఫలం ● సగం సగం పనులు చేసిన గుత్తేదారు
● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న జనం ● నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ● రైసుమిల్లులకు వెళ్తున్న భారీ వాహనాలు



నిజామాబాద్-ఖానాపూర్ రోడ్డు ఇదే..



ఖానాపూర్ గ్రామంలో గుంతలమయమైన రోడ్డు

నిజామాబాద్ రూరల్, జూలై, 20: జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్లే మార్గం అది. ఆ గ్రామం నగరంలోని 1వ డివిజన్ పరిధి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. కాలూరు రోడ్డు నుంచి మొదలు భాగ్యనగర్ కాలనీ, ఖానాపూర్ మీదుగా జన్నేపల్లి రోడ్డును కలుపుతుంది. నవీపేట, బాసరకు వెళ్లేవారు ఈమార్గం గుండానే వెళతారు. నవీపేటలోని మేకల సంతకు వెళ్లేవారు వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయి.ఈరోడ్డు సీసీ రోడ్డు కోసం గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల మంజూరుచేసింది. రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు పనులకు డబ్బులు సరిపోకపోవడంతో గుత్తేదారు పనులు సగంసగం చేశారు. దాంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిన్నపాటి వర్షానికే ఖానాపూర్ చిత్తడిగా మారింది. గత రెండు రోజులుగా సన్నగా కురుస్తున్న వర్షానికే రోడ్డుపక్కల నీరు నిలిచి గుంతలమయంగా మారింది. ద్విచక్రవాహనదారులకు, ఆటోలకు, సైకిళ్లమీద వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మార్గం గుండా భారీ వాహనాలు వెళ్లడం వల్ల రోడ్డు పాడవుతోంది. కాంగ్రెస్ హయాంలోనైనా ఈ రోడ్డుకు మోక్షం కలగాలని ఖానాపూర్, భాగ్యనగర్‌వాసులు కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



ఖానాపూర్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. మహిళలు ముఖ్యంగా గర్భిణులు ఈ మార్గం గుండా రావాలంటే చాలా ఇబ్బందిగా మారింది. వాహనదారులు సైతం గుంతల్లో పడి ఎంతోమంది గాయాలపాలయ్యారు. ఎన్ని కల సమయంలో గత ప్రభుత్వం తూతూ మంత్రంగా పనులు చేసింది. సగం పనులు మధ్యలోనే వదిలివేశారు. నిత్యం వందల మంది వెళ్లే ఈ రోడ్డును నాణ్యతతో వేయాలి.

-సాలుగారి మోహన్, ఖానాపూర్‌వాసి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చాం



ఖానాపూర్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం పాడవుతోంది. గత ప్రభుత్వ హయాంలో గుత్తేదారు పనులు సగంలో వదిలివేశారు. డబ్బులు సరిపోకపోవడంతో పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. రోడ్డు దుస్థితి గురించి ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డికి వివరించాం. త్వరలోనే నిదులు మంజూరుచేసి పనులు పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

- కొర్వ గంగాధర్, మాజీ సర్పంచ్, ఖానాపూర్

ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది బదిలీ

సిరికొండ, జూలై 20: సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే ఎంపీవో లక్ష్మిప్రసాద్ తోపాటు మరో ముగ్గరు సిబ్బంది బదిలీ అయ్యారు. గురువారం జరిగిన కౌన్సిలింగ్‌లో ఎంపీవో లక్ష్మిప్రసాద్ నందిపేట్‌కు బదిలీ కాగా, సీనియర్ సహాయకులు నారాయణ జిల్లా పరిషత్‌కు,జూనియర్ సహాయకులు లక్ష్మినారాయణ జిల్లా పరిషత్‌కు బదిలీ అయ్యారు. టైపిస్టు చంద్రశేఖర్ భీమ్‌గల్‌కు బదిలీ అయ్యారు.సిరికొండకు ఎంపీవోగా రుద్రూర్ నుంచి తారచంద్‌కు పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేయలేదని సమాచారం. మూడు పోస్టులు ఖాళీగా ఉండబోతున్నాయనేది అధికారులు చెపుతున్నా సమాచారం. ఉన్న ఒక్క అటెండర్ మోహినొద్దిన్‌ను న్యావనంది హైస్కూల్‌కు బదిలీ చేయగా, పెద్దవాల్గోట్ హైస్కూల్లో పని చేస్తున్న నిసార్‌ను సిరికొండ మండల పరిషత్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

పొతంగల్‌లో గ్రామసభ

కోటగిరి,జూలై20: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఆదాయ, వ్యయాలు, పారిశుధ్య పనులు, తాగునీటి సమస్యలపై తీసుకున్న చర్యలను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాల వల్ల రోడ్డు చిత్తడిగా మారుతున్నాయని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతీ, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బడాపహాడ్ రోడ్డుపై వర్షపు నీరు



రోడ్డుపైన నిలిచిన వర్షపు నీరు

మోస్రా,జూలై20: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలోని మోస్రా నుంచి బడాపహాడ్ వెళ్లే బైపాస్ రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులకు గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఇందుకు కారణం అధికారులు రోడ్డు వేసినప్పుడు సరైన ప్రణాళిక లేక ఈ సమస్య ఏర్పడిందని ఈ బైపాస్ మీదుగా బడాపహాడ్ దర్శనానికి వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయని ఇలాగే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని ఏర్పడిన గుంతలు పూడ్చాలని నీరుపోకుండా అడ్డుగా వేసిన మొరం తొలగించాలని మాజీ సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్థులు కోరుతున్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 20: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు శనివారం 18వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 48 మంది విద్యార్థులకు గాను 44మంది హాజర య్యారని, 4గురు గైర్హాజరయ్యారని చంద్ర శేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 80మంది విద్యార్థులకు గాను 76 పరీక్షకు హాజరయ్యారని, 4గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

నిజామాబాద్ రూరల్, జూలై, 20: రూరల్ మండలం చక్రదర్‌నగర్ తండాకు చెందిన బదావత్ రాజు (17) అనే యువకుడు తప్పిపోయినట్లు యువకుడి తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. బాదావత్ రాజు పుట్టుకతో మూగ, చెవిటి వైకల్యం కలవాడు. రెండు వారాల క్రితం ఇంటినుంచి బయటకువెళ్లిన రాజు తిరిగి రాలేదని తెలిపారు. తెలిసినవారిని విచారించినా సమాచారం లేకపోవడంతో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. గతంలో కూడా రాజు ఒకసారి ఇంటి నుంచి తప్పిపోయి హైదరాబాద్‌లో దొరికినట్లు తెలిపారు. రాజు ఆచూకీ తెలిసినవారు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

ధర్మారంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట

● చిన్నారులకు అక్షరాస్యత చేయించిన సీడీపీవో

డిచ్‌పల్లి,జూలై 20: ధర్మారం(బి) లో శనివారం అమ్మమాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో డిచ్‌పల్లి ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత,సూపర్‌వైజర్ శ్రీప్రియ తో కలిసి చిన్నారులకు అక్షర్యా భ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. అండన్ వాడి కేంద్రంలో సామూహిక అక్షరభ్యాసం చేయడం వల్ల చిన్నారుల్లో విద్యాపట్ల శ్రద్ధ పెరుగుతుందని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్ శ్రీప్రియ, అంగన్‌వాడీ టీచర్ ఎడవల్లిజ్యోతి సోమ్‌నాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఘన్‌పూర్ చెరువుకు వరద

డిచ్‌పల్లి,జూలై 20: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఘన్‌పూర్ రాజేశ్వర చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నార. ఖరీఫ్ సీజన్‌లో గత వారం రోజులుగా ఆశా జనకంగా వర్షాలు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.చెరువులో వరద నీరు చేరడంతో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

వర్షం నీటిలో విద్యార్థుల ఇబ్బందులు



వర్షం నీటిలో విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూలై 20: నగరంలోని హమాల్‌వాడిలో గల దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వర్షం నీటిలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎడ తెరపి లేని వర్షం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా పీడీఎస్‌యు నాయకులు పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ దారుగల్లి ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని వర్షాకాలం వచ్చిందంటే చాలు పాఠశాల ప్రాంగణంలో వర్షంనీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కావున సమస్యను పరిష్కరించాలని కోరారు. బాత్‌రూమ్‌లు కూడా సక్రమంగా లేవని స్కూల్ బిల్డింగ్ సైతం పురాతనంగా మారిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, భరత్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి'



విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న మేనేజర్ మల్లేష్

సిరికొండ జులై 20 : లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని బ్యాంక్ ఆఫ్ బరోడ మేనేజర్ బూస మల్లేష్‌యాదవ్ విద్యార్థులను కోరారు. బ్యాంక్ ఆఫ్ బరోడ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తూంపల్లి గ్రామంలో సుమారు 300 మంది హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను శనివారం మేనేజర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే గోల్ పెట్టుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు. పదోతరగతిలో పదికి పది గ్రేడింగ్ పాయింట్లను సాధించాలనే పట్టుదలతో చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని పరీక్షలకు ప్రిపేర్ కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఉగులోత్ నరేందర్, క్యాషియర్ శ్రావన్‌కుమార్, నూనెరవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



ఫకీరాబాద్‌లో నిరసన తెలుపుతున్న లిఫ్టు కార్మికులు

నవీపేట, జూలై 20 : పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ శనివారం మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ఆలీసాగర్, గుత్పఎత్తిపోతల పథకం కార్మికులు నిరసన చేపట్టారు. గత నాలుగు మాసాలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని వెంటనే వేతనాలు చెల్లించే విధంగా అధికారులు తగినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వర్షంలో తడుస్తూ తమ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో గణేష్, సందీప్, నరేష్, తదితరులున్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ధర్నా



వినతిపత్రం సమర్పిస్తున్న ముదిరాజ్‌లు

కోటగిరి, జూలై 20 : కోటగిరి, పొతంగల్ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శనివారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు, చెరువులు, కుంటలపై ముదిరాజ్, బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వివిధ పథకాల కింద 75శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ సాయిలు, ఉత్తం, రాములు, సుదర్శన్, గంగాధర్, ఉదయ్ భాస్కర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు'



సూచనలిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మోస్రా, జూలై 20 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ కోసం, కేటాయించవలసిన సమయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంత శ్రద్ధగా ఉన్న ఇంటి వద్ద కూడా శ్రద్ధతో చదివేల సమయం ఇవ్వాలని పిల్లలకు చదువు ఒకటి కాకుండా మానసిక ఒత్తిడికి లోనవకుండా ఆరోగ్యం పట్ల, శరీరం దృఢంగా ఉండాలంటే ఆటల కొరకు కొంత సమయం ఇస్తూ ఉన్నాం అదే విధంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ విధంగా జరిగే పాఠశాలలో తల్లిదండ్రుల కార్యక్రమంలో ప్రతి విద్యార్థి నుంచి ఇంటి పెద్ద ఒకరు రావాలని తగు సూచనలు ఇస్తూ తెలుసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మత్తు పదార్థాలను అరికట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 20 : జిల్లాలో గంజాయి మత్తు పదార్థాలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో ఉన్న మూడుకల్లు డిపోల్లో గీత కార్మికులకు సిట్టింగ్ జీతం పేరుతో చెట్ల నుంచి కల్లు తీయకుండా ఆల్ప్రోజోలం కలిపి తయారు చేస్తున్నారని అన్నారు. కల్తీ కల్లు ఘనత కాంట్రాక్టర్లదేనని అన్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం డిపోకు ఈత, తాటి చెట్లు కేటాయించారో ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరం ఎక్సైజ్ అధికారులపై ఉందన్నారు. నిజామాబా ద్ నగరంలో అధికారులు ఉన్నప్పటికీ ప్రమాదకరమైన ఆల్ప్రోజోలం మత్తు పదార్థాలను కలిపి కల్లుకు బానిస చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎక్సై జ్ అధికారులు స్పందించి కల్తీకల్లుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓమయ్య రఘురాం, నర్సింగ్‌రా వు, సురేష్, గంగాధర్, ఆనంద్, భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

వేల్పూర్, జూలై20: ప్రస్తుతం వర్షాకాలంలో లభించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్‌చంద్ర ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ కలర, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వ్యాధుల నిర్మూలనకు వైద్య శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు కలిసి కృషి చేయాలన్నారు. కలర, డయేరియా వచ్చిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. గ్రామాలలో ఈ వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటిస్తూ ఇంటి చుట్టు మురికి నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జూలై 20: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు కొండపై చేరుకొని కొండపై చుట్టు భక్తులు కలిసి ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్లాటును కాజేసిన వ్యక్తిపై కేసునమోదు

కామారెడ్డి టౌన్, జూలై 20 : పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న 200 గజాల ప్లాటును కాజేసిన మారం శ్రీనివాస్‌తో పాటు అతనికి సహకరించిన ఆరేటి గంగాధర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2002లో గాంధీనగర్‌లో కలిమెళ్ల రాజయ్య అనే వ్యక్తి 200 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఆ తర్వాత అత ను అనారోగ్య కారణం వల్ల చనిపోయాడు. 2015వ సంవత్సరంలో కామారెడ్డి వీక్లిమార్కెట్‌కు చెందిన మారం శ్రీనివాస్ అనే వ్యక్తి, ఆ ప్లాట్‌పైన కన్నువేసి ఎలాగైనా ఆప్లాటును తన సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆ ప్లాట్ ఓనర్ అయిన రాజయ్య కుమారుడు కలిమెలా మహేందర్ ఉన్నట్లుగా తెలుసుకున్నాడు. రాజయ్య కుటుంబసభ్యులకు తెలియకుండా వీక్లీ మార్కెట్‌కి చెందిన ఆరేటి గంగాధర్ అనే వ్యక్తిని రాజయ్యకొడుకు మహేందర్‌లాగా చూయించి మహేందర్ తండ్రి రాజయ్య చనిపోయిన తర్వాత ఆ ప్లాట్‌కి మహేందర్ వారసత్వంగా యజమాని అని తప్పుడు డాక్యుమెంట్ చూపించి, మహేందర్ ప్లేస్‌లో ఆరేటి గంగాధర్‌ను సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు తీసుకెళ్లి ఆ ప్లాటును మారం శ్రీనివాస్ దొంగతనంగా తన పేరు మీద మార్చుకున్నాడని తెలిపారు. ఈ తదుపరి ఆ ప్లాట్‌ను కామారెడ్డి పట్టణంలోనే ఉన్న మరో వ్యక్తికి అమ్మేశాడని తెలిపారు. ఈ విషయం తెలియని కలిమెల మహేందర్ తన తండ్రి కొనుగోలు చేసిన ప్లాట్ వద్దకు వచ్చి చూడగా అది వేరే వారి యొక్క స్వాధీనంలో ఉండడాన్ని గమనించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. కేసు నమోదుచేసి విచారణ జరిపి బాధ్యులైన శ్రీనివాస్, గంగాధర్‌లను అరెస్టుచేసి శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

శ్మశానవాటికలో నిరుపయోగంగా స్నానపుగదులు



స్నానపు గదుల గోడల పైనుంచి పడిపోయిన రేకులు

డొంకేశ్వర్, జూలై 20 : డొంకేశ్వర్ మండలం గంగాసరం గ్రామంలో శ్మశాన వాటిక స్నానపు గదులు నిరుపయోగంగా మారాయి. గత ఆరేళ్ళ క్రితం గదులు గోడలపైన రేకులు వేసి గదులను నిర్మించినా రెండేళ్ళ క్రితం వర్షం బలమైన ఈదురుగాలులు వీయడంతో గోడలపై వేసిన రేకులు చిందవందరగా ఎక్కడికక్కడ పడిపోయాయి. అప్పటి నుంచి వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో అక్కడికి అంత్యక్రియలకు వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ళ నుంచి అధికారులకు సమస్యపై విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిని మరమ్మతులు చేయించాలని గ్రామస్థులను కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

నవీపేట,జూలై20: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, సంగెం శ్రీనివాస్, భగవాన్, బాలరాజు గౌడ్, ఎస్కే బాబు, మానికేశ్వర్ రావు, చల్లా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయింపు



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌టౌన్, జూలై20: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని శనివారం పీడీఎస్‌యూ నాయకులు మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మోడల్ స్కూల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో సమస్యలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా పరిష్కరించడంలేదని, మున్సిపల్ కమిషనర్ తక్షణమే పరిష్కరించాలని లేని యెడల విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయిస్తామని అన్నారు. మోడల్ పాఠశాలకు వెళ్లాలంటే స్కూల్ ముందు నీటి ప్రవాహం నదిలా ఉందని, అలాగే కస్తూర్బా పాఠశాలలో అడవిని తలపించేలా చెట్లు పొదలు పెరిగిపోయయని, వందలాది విద్యార్థులకు గత కొన్నేళ్లుగా బాధలు అనుభవిస్తున్నారని పీడీఎస్‌యూ నాయకులు వర్షంలో నిరసన తెలుపుతూ బైఠాయించారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి విద్యార్థుల సమస్యలు తెలిసిన పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందని, తక్షణమే ఎమ్మెల్యే చొరవ తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతర మున్సిపల్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శి నిఖిల్, సిద్దార్థ, మమత, తదతరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు సూపరింటెండెంట్ బదిలీ



జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్

నిజామాబాద్ రూరల్, జూలై, 20: జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ కుమార్ బదిలీ అయ్యారు.ఆయనను నల్లగొండ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా బదిలీచేశారు. ఖమ్మం జైలు నుంచి వచ్చిన ప్రమోద్‌కుమార్ ఐదేళ్ల పదవీకాలం పూర్తికావడంతో బదిలీ జరిగింది. సారంగపూర్‌లోని జిల్లా జైలు పర్యవేక్షణలో సెంట్రల్ జైల్‌గా అనుమతి లభించింది.సెంట్రల్ జైలుకు కావలసిన అన్ని వసతులు,ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా జైలుకు ఇక సెంట్రల్ జైల్ హోదా రావాల్సి ఉంది. జైలు ఆవరణలో ఖైదీలతో నిర్వహిస్తున్న నర్సరీ ప్రశంసలు పొందింది. వందల జాతుల పూలు, పండ్ల మొక్కలు నర్సరీలో పెంచుతున్నారు .ఇక్కడి నర్సరీ నుంచి పలు ప్రాంతాలవారు మొక్కలు తీసుకెళ్తున్నారు. ఖైదీలకు నైపుణ్యత పెంచడం, వారిని విద్యావంతులు చేయడంలో సూపరింటెండెంట్ ప్రముఖ పాత్ర పోషించారు. జిల్లా జైలులో ఖైదీలచే తయారుచేయబడుతున్న ఐరన్‌వర్క్, ఫుడ్‌వర్క్, ఫర్నీచర్, బీరువాలు, విద్యార్థులకు దుస్తులు కుట్టుడం,ప్రింటింగ్ వంటి రంగాల్లో ఖైదీలకు తర్ఫీదునిచ్చారు.

పాఠశాల సమయాల్లో మార్పులు

నిజామాబాద్ అర్బన్, జూలై 20:ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలల సమయాల్లో మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30ల నుంచి సాయంత్రం 4.45 బదులుగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు నిర్వహించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు.

రేపటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్పు

మోర్తాడ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్పు చేయడం జరిగిందని ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. ఉన్నత పాఠశాలలు,ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల వలనే ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ఈనెల 22నుంచి పాఠశాలలు నడపాలని ఎంఈవో కోరారు.

ఘన్‌పూర్‌లో అంగన్‌వాడీ విద్యార్థుల ర్యాలీ

డిచ్‌పల్లి,జూలై 20: మండలంలోని ఘన్‌పూర్‌లో శనివారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత కిచన్ గార్డెన్, సామూహిక అక్షరఅభ్యాసం కార్యక్రమాలను నిర్వహించినట్లు సూపర్‌వైజర్ బుజ్జితెలిపారు.ఈకార్యక్రమంలో శారత,జ్యోతి, సవిత, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

అధికారుల హాజరు పక్కాగా ఉండాలి

సుభాష్‌నగర్, జూలై 20: ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల హాజరు పక్కాగా ఉండాలని నగర మున్సిపల్ కమిషనర్ మందమ కరంద్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులు హాజరుపట్టిక పక్కాగా ఉండేందుకు వివిధ డివిజన్‌లకు ఇంచార్జిలను నియమించారు. జోన్ వారిగా ఐదుగురికి బాధ్యతలను అప్పచెప్పారు. ఒకటవ జోన్‌కు శంకర్, మూడవ జోన్‌కు రాజేంద్రకుమార్, నాల్గవ జోన్‌కు మురళీమోహన్‌రెడ్డి, ఐదవ జోన్‌కు జనార్ధన్, రెండవ జోన్‌కు నరేందర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. 22వ తేదీ నుంచి ఇంజనీరింగ్ విభాగం పనిచేస్తున్న అందరు హాజరుపట్టికను పక్కాగా పరిశీలించాలన్నారు. వారి ఆధార్‌కార్డు తీసుకోవాలని ఏదైనా హాజరులో తేడా వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

టీయూలో ముందస్తు గురు పౌర్ణమి వేడుకలు

డిచ్‌పల్లి,జూలై 20: తెలంగాణ విశ్వవిద్యాలయంలో శనివారం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో తమ గురువులకు కృతజ్ఞతాపూర్వకంగా పుష్ప గుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటాలు, కథలతో అలరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు అంజనేయులు, అపర్ణ, వాణి, కైసర్ మహమ్మద్, రాజేశ్వరి, కిరణ్‌రాథోడ్‌లను విద్యార్థులు సన్మానించారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్‌లు తమ అనుభవనాలను పంచుకున్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తోంది

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పెంటాఖుర్దులో క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,జూలై20: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు రైతులను మోసం చేశాయని విమర్శించారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అమలు చేస్తారన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడుతూ మహిళ సంఘం భవనం కోసం రూ.10లక్షల నిధులు కేటాయిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. బోధన్, సాలూర మండలంలోని తదితర గ్రామాలలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ముగింపు దశకు చేరిన ఆలయ పునర్నిర్మాణ పనులు



మాట్లాడుతున్న సంతోషిమాతా సాయిబాబా మందిర్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూలై 20: నగరంలోని హమాల్‌వాడిలోగల శ్రీసంతోషిమాతా సాయిబాబా ఆలయం పునర్నిర్మాణం పనులు ముగింపు దశకు చేరినందున ఆగస్టు 26వ తేదీ నుంచి 28 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు శ్రీధర్‌గుప్త, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఏవో వేణులు తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కొరకు గతంలో ఉన్న ధర్మకర్తల మండలి భక్తుల నుంచి రూ.14లక్షల 52వేల 397లు జమ చేసి బ్యాంకులో జమ చేయగా దానికి వడ్డీ రూపకంగా ఒకలక్షా 99వేల 361 రూపాయలు రాగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా సీజీఎస్ నిధులు 33లక్షల 56వేల 754 మంజూరు అయ్యాయని మళ్లీ భక్తుల నుంచి 24లక్షల 83వేల 512 రూపాయలు విరాళాలు స్వీకరించడం జరిగిందని అన్నారు. ఒక భక్తుడు గుప్తదానం కింద 10లక్షలు అందజేశారని వారు తెలిపారు. ధ్వజస్థంభానికి కొంత మంది, గ్రిల్స్ కొరకు, గర్భాలయ గ్రానైట్ కొరకు భక్తులు విరాళాలు ఇచ్చారని వారు తెలిపారు. ఆగస్టు 26 సోమవారం నుంచి బుధవారం వరకు శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీసంతోషిమాతా మరియు శ్రీసాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణం దాదాపు పూర్తిదశకు వచ్చిందని శ్రావణమాసంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరించిన భక్తులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భాష్యం కృష్ణమాచారి, గంగవరపు నారాయణశర్మ, వేముల భూమేశ్వర్, మేక లక్ష్మీయాదవ్, గాంద్రేశోభ, రాజేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన విద్యుత్ స్తంభాలు తాకరాదు

డిచ్‌పల్లి,జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇంటి గోడలు, పంట పొలాల్లోని స్టార్టర్లు, విద్యుత్ తీగలు తాక రాదని, విద్యుత్ తీగలు చెట్లకు తగిలి ఉన్న విద్యుత్ షాట్ సర్క్యూట్ అయ్యే ఆస్కారం ఉంటుందని కావున ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈ ఉత్తమ్ జాడే తెలిపారు. ఉతికిన బట్టలను ఇనుప తీగలపై వేయకూడదని, గాలి దుమారం వల్ల తెగిన విద్యుత్ వైర్లు ముట్టుకోవద్దని, సూచించారు. కరెంట్ లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడ వద్దని వినియోగదా రులకు సూచించారు. తడి చేతులతో స్విచ్ఛ బోర్డులనుతా కవద్దని సూచించారు. చిన్న పిల్లలను విద్యుత్ వస్తువులకు దూరంగా ఉంచాలన్నారు.

వర్నిలో పిచ్చి మొక్కల తొలగింపు

వర్ని,జూలై20: వర్ని మండల కేంద్రంలో గల రైతు వేదిక ఆవరణలో గల పిచ్చి మొక్కలను డోజర్ ద్వారా తొలగించారు. సత్యనారాయణ పురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మండల కేంద్రంలో దోమల నివారణకు మందును పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నగేష్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, ఆపరేటర్ రవి పాల్గొన్నారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 20: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలను పరిష్కరించే దిశగా చర్చించాలన్నారు. శనివారం ఏఐపీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అనిల్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 8,214 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని దీంతో పాటు మొత్తం బడ్జెట్‌లో కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు 30శాతం బడ్జెట్‌ను విద్యారంగానికి కేటాయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను పునర్నిమించాలన్నారు. హాస్టల్‌లలో మెస్‌చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని కోరారు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజులు బకాయిలు ఉండటంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని కావున ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని లేదంటే ఎలాంటి షరతులు లేకుండా ప్రైవేటు కళాశాలలు సర్టిఫికెట్లు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, టీఎస్ఎస్ఎఫ్ నాయకులు యూసుఫ్, నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

సుభాష్‌నగర్, జూలై 20: వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని సర్కిల్, డివిజనల్, సెక్షన్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అనంతరం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొర్లికొండలో బాలుర వసతిగృహం తనిఖీ

జక్రాన్‌పల్లి, జూలై20: మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల బాలుర వసతిగృహాన్ని శనివారం ఎంపీడీవో సతీష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు వండి వడ్డిస్తున్న భోజనం సరుకులను ఆయన పరిశీలించారు. హాస్టల్‌లో తాగునీటి సమస్య ఉందని, వార్డెన్ సంతోష్ ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే మిషన్ భగీరథ ఏఈతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి హాస్టల్ విద్యార్థులకు మిషన్ భగీరథ నీటిని అందించాలని ఆదేశించారు. తాత్కాలికంగా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని పంపిస్తానని ఎంపీడీవో తెలిపారు. హాస్టల్‌లో పైప్‌లైన్ లీకేజీ కావడంతో మరమ్మత్తులు కోసం స్థానిక అధికారులను ఆదేశించారు.ఎంపీడీవో వెంట పీఆర్‌ఏఈ సురేంద్రవర్మ, వార్డెన్ సంతోష్‌లు ఉన్నారు.

నాణ్యమైన చేప పిల్లలను అందించాలని వినతి

ఎడపల్లి, జూలై20: ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లలలో నాణ్యమైన చేప పిల్లలను అందించాలని కోరుతూ శనివారం ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు మండల గంగపుత్రులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా గంగపుత్రులకు అందించే చేప పిల్లలలో నాణ్యమైన చేప పిల్లలను అందించాలని వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో మండలంలోని వివిధ గ్రామాల గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సుండు నర్సయ్య, మంగల్పాటి లింగం, గంగాధర్, రాంబోయి, ఎడపల్లి గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పిల్లలు చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

ముప్కాల్, జూలై20: పిల్లలు ఉన్నత స్థాయి చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని ముప్కాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం సూచించారు. శనివారం ముప్కాల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యబోదన చేస్తున్నారా, పిల్లలు బాగా చదువుతున్నరా అనే విషయాలు తెలుసుకుంటే విద్యార్థులు వృద్ధిలోకి వస్తారని, ఉపాధ్యాయులు నిర్వహించే సమావేశానికి తల్లిదండ్రులు హాజరుకావాలని సూచించారు.పిల్లలు ఏలా చదువుతున్నారు, వారికి ఏలాంటి సమస్యలు ఉన్నాయా అనే విషయాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలంటే సమావేశాలకు వస్తే పిల్లల సామర్థ్యం తెలుస్తుందని అన్నారు.పిల్లలను ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యే విధంగా శ్రద్ధ వహించాలని సూచంచారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఎల్ సంతోష్‌ను కలిసిన జిల్లా నేతలు

పెద్దబజార్, జూలై 20: బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను ఢిల్లీలో శనివారం ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ కులాచారి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మోరెపల్లి సత్యనారాయణలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన విషయాలపై చర్చించారు.

పచ్చలనడ్కుడలో మధ్యాహ్న భోజనం పరిశీలన



పచ్చలనడ్కుడలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, జూలై20: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల గదులను, విద్యార్థులకు విద్యబోధన జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డిస్తూ రుచి చూశారు. మధ్యాహ్న భోజనానికి వాడే వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, తాజా కూరగాయలతో వండాలని, వంటలాన్ని రుచిక రంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ప్రైవేటు పాఠశాల లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మరింత మెరుగ్గా ఉండాలని, అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాలకు వచ్చిన సందర్భంగా అన్వేష్‌రెడ్డిని ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్,ఉపాధ్యాయులు,స్థానికకాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, జూలై 20: బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సుభాష్ నగర్‌లోని జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత అధ్యక్షతన జనరల్‌బాడి సమావేశాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండివెంకట్ పర్యవేక్షణలో నిర్వహించి 17 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా సబ్బనిలత, ఉపాధ్యక్షులుగా టి.రాజు, సాయికుంబ్లె, ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా జగదీశ్,సయ్యద్, కోశాధికారిగా దండు జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులుగా రాజేందర్, శంకర్, మోహన్ గౌడ్, యాదయ్య, గీతాంజలి, బాల్‌రాజ్, సుజాత, శ్రీమాన్, అజయ్, చంద్రగౌడ్‌లు ఎన్నికయ్యారు.ఒకవైపు కార్మిక సంఘాలని ర్మాణం, మరోవైపు కులసంఘాల నిర్మాణం ద్వారా కులవర్గ పోరాటాల ద్వారా కుల వర్గనిర్మూలన కోసం ఉద్యమిస్తున్నామని ఆమె తెలిపారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

M.G. రోడ్ బ్రాంచ్ (20110), ఆర్మూర్, జిల్లా : నిజామాబాద్

స్వాధీనతా ప్రకటన

రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

(SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 (4) క్రింద అస్తి స్వాధీనానికి సంబంధించి ప్రకటన ప్రచురణ)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తంను మిమ్మల్ని చెల్లించవలసినదిగా కోరుతూ ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న తేదిన డిమాండ్ ప్రకటన జారీచేశారు.

సదరు మొత్తంను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు చట్టం యొక్క రూలు 9తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి /ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీనం చేసుకొన్నారని రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ప్రతి ఖాతకు ఎదురుగా పేర్కొన్న తేదిన నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకం హెచ్చరించబడుచున్నారు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారమైనా **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెల్లించుటకు లోబడి ఉంటాయి.

రుణగ్రహీత/ హామీదారు పేరు :	ఆస్తుల వివరాలు/ తాకట్టు పెట్టబడిన సెక్యూర్డ్ ఆస్తుల చిరునామా:	డిమాండ్ నోటీస్ ప్రకటన తేదీ	స్వాధీనత తేది:	బకాయి మొత్తం
శ్రీ పెద్ది రవి తండ్రి రాజేశ్వర్, ఇ.నం.7-31, గ్రామం: పిప్రి, మండలం: ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్, హోమ్ లోన్ ఎకౌంట్ నం.39950081956, ఎస్‌బిఐ సురక్ష అకౌంట్ నం.40895298815	డాక్యుమెంట్ నం.651/2021, తేది 16/01/2021 ప్రకారం శ్రీ పెద్ది రవి, తండ్రి రాజేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ సబ్ జిల్లా రిజిస్ట్రేషన్ మరియు నిజామబాద్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆర్మూరు మునిసిపాలిటీ, ఆర్మూరు మండలం యొక్క పిరిటిట్ గ్రామం వద్ద గల 1125.00 చ.అ.ల బిల్టప్ ఏరియా, ఆర్‌సిసి రూఫ్ కలిగిన మొదటి అంతస్తు మరియు 1125.00 చ.అ.ల బిల్టప్ ఏరియా, ఆర్‌సిసి రూఫ్ కలిగిన గ్రౌండ్‌ఫ్లోర్, ప్లింత్ ఏరియాతో 166.66 చ.గ.లు లేదా 139.35 చ.మీల విస్తీర్ణం, సర్వే నం.23/5/బి2 భాగంలో గల ఖాళీ ప్లాట్ నం.1 పై నిర్మించిన గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులతో ఆర్‌సిసి రూఫ్ కలిగి సగం పూర్తయినా నివసిత భవనం యావత్తు. పరిహద్దులు: ఉత్తరం: ఇతరుల భూమి, దక్షిణం: ప్లాట్ నం.2, తూర్పు: 30'-0" వెడల్పు రోడ్, పశ్చిమం: ఇస్సపల్లి గంగారం భూమి	17.05.2024	19.07.2024	బకాయి మొత్తాలు (ప్రకటన తేదీ నాటికి) : 07.05.2024 నాటికి రూ.77,80, 276/- (రూపాయలు డెబ్బై ఏడు లక్షల ఎనభై వేల రెండు వందల డెబ్బై అరు మాత్రమే) + వడ్డీ+ చార్జీలు

ప్రదేశం : ఆర్మూర్
తేది : 19.07.2024,

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 16మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 20: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ,ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు శనివారం 5వ రోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 104మంది విద్యార్థులకు గాను 101 మంది పరీక్షకు హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 156మంది విద్యార్థులకు 143విద్యార్థులు హాజరయ్యారని, 13మంది గైర్హాజర య్యారని డైరెక్టర్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆర్మూర్‌టౌన్, జూలై20: పట్టణంలోని దేవి బంకెట్‌హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. 2024-25 సంవత్సరానికి గాను నూతన లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడిగా పొల్కం వేణు, కార్యదర్శిగా దాచేపల్లి సంతోష్, కోశాధికారిగా ఇపాంపెట్టి అశోక్‌లు ప్రమాణ స్వీకారం చేయగా వారిని పట్టుశాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ విజయలక్ష్మీ, ఇన్స్టాలేషన్ ఆఫీసర్ ఎస్ఎస్.శ్యామ్‌కుమార్, ఇండక్షన్ ఆఫీసర్ బసవేశ్వర్ రావు, రిజియన్ చైర్మన్ డికె.రాజేష్, కార్యదర్శి నర్సయ్య, జోన్‌చైర్మన్ చేపూర్ గణేష్, లయన్స్ సభ్యులు గంగప్రసాద్, అల్జాపూర్ రాజేష్, నరేందర్, ఆకుల రాజు, నివేదన్, సాయికృష్ణ, శీను, నవీన్,బాలాజీ, సాగర్, నాని, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి



ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

ముప్కాల్,జూలై20:బీసీ కుల గణన చేపట్టి దామశ ప్రకారం బీసీ రిజర్వేషన్ చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరిమూర్తి అన్నారు. శనివారం బాల్కొండ మండలం లోని కిసాన్‌నగర్‌లో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్ స్వగృహంలో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్‌ను శాలువతో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈకార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఆర్గనైజర్ కార్యదర్శి శ్రీధర్, బండి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74700	రూ.68,900	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

- స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
  : భారతీయుడు-2 (2.45)
  : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
- స్క్రీన్-2 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.45, 1.50, 7.25, 10.30)
  : కిల్ (హింది) (4.55)
- స్క్రీన్-3 : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
  : డార్లింగ్ (1.05, 7.00, 10.20)
  : జస్ట్ ఎ మినట్ (4.25)
- స్క్రీన్-4 : డార్లింగ్ (10.40)
  : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (2.00, 7.30)
  : ది బర్త్‌డే బాయ్ (4.50)
  : పేక మేడలు (10.20)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (12.35, 4.00, 7.25)
  : డార్లింగ్ (10.50)
- స్క్రీన్-2 : భారతీయుడు-2 (4.20, 10.45)
  : కల్కి(తెలుగు) (10.00)
- స్క్రీన్-3: కల్కి(తెలుగు) (10.50)
  : భారతీయుడు-2 (1.00, 7.20)
  : డార్లింగ్ (4.25)

- దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : క్రైమ్ రీల్ (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్: కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్